జనం కోసం - మన అక్షరం

# అక్షర వెలుగు

www.aksharavelugu.com

తెలుగు దిన పత్రిక

TELTEL02057

శని వారం 19.03.22 | తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ | ఎడిటర్ : పృధ్విరాజు. జి | సంపుటి - 01, సంచిక-29 | పేజీలు - 4 | వెల రూ. 5

Published From Hyderabad Circulated by Hyderabad, Rangareddy, Nalgonda, Karimnagar, Warangal, Mahaboobnagar, Kammam, Medak





ఏ.సి.బి. టోల్ ఫ్రీ నెంబర్ - 1064 -104

Anti-Corruption Bureau, Telangana State
అవినీతి నిరోధక శాఖ, తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యాలయం
రోడ్ నెంబర్ 12, బంజారా హిల్స్, హైదరాబాద్ - 500 034
ఫోన్ నెంబర్ : 040-23251555, 9440446126
ఈ-మెయిల్ : dg_acb@telangana.gov.in


## దేశంలోనే మొదటి సారి విడాకుల నమోదు చట్టం



**హైదరాబాద్, మార్చి 18 (అక్షర వెలుగు):** కేరళ కొత్త చట్టానికి శ్రీకారం చుట్టనుంది. విడాకులను చట్టం పరిధిలోకి తీసుకొని వచ్చి వాటిని నమోదు చేసేలా కొత్త గా చట్టాని తీసుకు రావాలని చూస్తోంది. దేశంలోని అనేక రాష్ట్రాలకు ఈ చట్టం ఆదర్శం కానుందని ఆ రాష్ట్ర మంత్రులు చెబుతున్నారు. ఇప్పటి వరకు కేవలం వివాహాలు మాత్రమే చట్ట బద్ధంగా అయ్యేవని.. ఇకపై విడాకులు కూడా కచ్చితంగా చట్టం పరిధిలోకి వచ్చి వాటి నమోదు ప్రక్రియను తప్పనిసరి చేసేలా అడుగు వేస్తుంది. ఈ విషయాన్ని ఆ రాష్ట్ర ఆబ్కారీ శాఖ మంత్రి గోవిందన్ తెలిపారు. దేశ వ్యాప్తంగా ఇప్పటి వరకు ఎవరూ తీసుకురాని చట్టాని తాము తీసుకుని వచ్చి అమలు చేస్తామని చెబుతున్నారు. దీనికి సంబంధించిన చట్ట సవరణలు కూడా పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ చట్టాన్ని తీసుకుని వచ్చి అమలు చేస్తే ఇలా చేసిన మొట్ట మొదటి రాష్ట్రంగా కేరళ నిలుస్తుందని మంత్రి గోవిందన్ తెలిపారు. తమ ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజలకు (మిగతా 3వ పేజీలో)

## ఆ కారు నాది కాదు.. : ఎమ్మెల్యే షకీల్ రియాక్షన్




**హైదరాబాద్, మార్చి 18 (అక్షర వెలుగు):** హైదరాబాద్, జూబ్లీహిల్స్‌లో జరిగిన కారు ప్రమాదంపై బోధన్ ఎమ్మెల్యే షకీల్ ఎట్టకేలకు స్పందించారు. ప్రమాదం విషయం తన దృష్టికి వచ్చిందన్నారు. ప్రమాదానికి గురైన కారు తనదికాదని ఆయన స్పష్టం చేశారు. తన కజిన్ కారు తగిలి పసిపాప మృతి చెందిందని తెలిపారు. తన కజిన్ కారును తాను కూడా అప్పుడప్పుడు వాడతానని చెప్పారు. అందుకే ఆ కారుపై ఎమ్మెల్యే స్టిక్కర్ పెట్టామని పేర్కొన్నారు. పసిపాప ప్రాణం పోవడం చాలా బాధకల్గించిందన్నారు. ట్రీట్‌మెంట్ ఇప్పించాలని తన కజిన్‌కు చెప్పినట్లు తెలిపారు. కారు ప్రమాదం ఎలా జరిగిందన్న విషయాన్ని తన కజిన్ వివరించాడని చెప్పారు. జూబ్లీహిల్స్ రోడ్ నెంబర్ 45లో ఒక మహిళా యాచకురాలు అకస్మాత్తుగా పరిగెత్తడం వల్లనే యాక్సిడెంట్ అయిందని తనకు తెలిసిందని ఎమ్మెల్యే షకీల్ తెలిపారు. దాటుతున్న మహిళని కారు అదుపు తప్పి ఢీకొం ది. మహిళ చేతిలో నుంచి జారి పడి రెండున్నర నెలల బాబు మృతి చెందాడు.

**ఇద్దరి అరెస్టు!**

జూబ్లీహిల్స్ కారు ప్రమాదం కేసులో ఇద్దరిని పోలీసులు అరెస్ట్ చేశారు. మీర్జా అతని కుమారుడిని జూబ్లీహిల్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. రోడ్డు దాటుతున్న ముగ్గురు యాచక మహిళలను కారు ఢీకొట్టింది. ఓ మహిళ చేతిలో ఉన్న రెండున్నర నెలల బాబు కిందపడడంతో తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతిచెందాడు.

## ఆదివాసీలకు మేం వ్యతిరేకం కాదన్న చినజీయర్



**హైదరాబాద్, మార్చి 18 (అక్షర వెలుగు):** సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న తన వ్యాఖ్యలపై త్రిదండి చినజీయర్ స్వామి వివరణ ఇచ్చారు. లక్ష్మీ దేవి పుట్టినరోజు సందర్భంగా ఏపీలోని విజయవాడ కనకదుర్గ అమ్మవారి ఆలయానికి వెళ్లిన చినజీయర్ స్వామి.. ఈ వివాదంపై స్పందించారు. సమ్మక్క- సారక్క జాతర గురించి ఆయన చేసిన వ్యాఖ్యలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న విషయం అందరికీ తెలిసిందే. ఆ వివాదంపై స్పందించిన చినజీయర్ స్వామి.. ఆదివాసీ గ్రామ దేవతలను తూలనాడినట్లు చేస్తున్న ప్రచారం సరికాదని హితవు పలికారు. తాము ఆదివాసీలను ఎప్పుడూ.. ఎవరినీ.. ఏమీ అనలేదని అన్నారు. ఆదివాసీ దేవతల పేరు చెప్పుకుని జరుగుతున్న అసాం ఘిక కార్యక్రమాల గురించి వివరించే సందర్భంలో 20 ఏళ్ల క్రితం చెప్పిన మాటలని పేర్కొన్నారు. అయినా.. 20 ఏళ్ల క్రితం తాను చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు తెర మీదికి రావటానికి కారణం ఏంటనేది ఆలోచించాల్సిన విషయమని చెప్పారు. తాను ఏ సందర్భంలో ఆ వ్యాఖ్యలు చేశానో.. దాని పూర్వాపరాలు చూడకుండా కేవలం కొన్ని మాటలనే ప్రచారంలోకి తీసుకువచ్చారని వివరించారు. దేశంమంతా సమతామూర్తిస్థాపన గురించి మాట్లాడుకుంటున్న వేళ.. అది సహించని కొందరు తమపై విషప్రచారం చేయాలని చేసిన చర్యగా భావిస్తామన్నారు. మహిళలు ఆదివాసీలను వెలుగులోకి తీసుకురావాలన్న భావన నుంచి వచ్చిన తాము... వారిని అవమాన పరిచేలా ఎప్పుడూ మాట్లాడమని స్పష్టం చేశారు. ఆదివాసుల సంక్షేమం కోసం వికాస తరంగిణి ద్వారా అనేక సేవలు అందించినట్టు చినజీయర్ స్వామి తెలిపారు. ఆ పేరుతో అరాచకాలను సృష్టించే వాళ్లను అరికట్టాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. నిజంగా సామాజిక హితం కోరే వ్యక్తులైతే వచ్చి మాట్లాడాలని సవాలు విసిరారు. విషయం తెలుసుకోవాలని.. ఆ తర్వాత సరైన విధానంలో స్పందించాలని హితవు పలికారు. పబ్లిసిటీ కోరుకునే విధంగా చేసే ఇలాంటి అల్ప ప్రచార కార్యక్రమాల్లో ఎలాంటి సామాజిక హితం ఉండదన్నారు. సమాజం ప్రజలకు ఉపయోగపడే ఏ కార్యక్రమమైనా అందులో తాము ఉంటామని.. అలాంటి వాళ్లను కలిసేందుకు ఎప్పుడూ సంసిద్ధంగా ఉంటామన్నారు. సమాజం అనే పెద్ద వేదిక మీద పనిచేసే సమయంలో అందరూ కలిసి పనిచేస్తేనే అది సమాజానికి ఆరోగ్యకరమని వివరించారు.

## త్రిదండి చినజీయర్‌పై చర్యలు తీసుకోవాలి

**టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి ట్వీట్**



**హైదరాబాద్, మార్చి18(అక్షర వెలుగు):** తెలంగాణ పౌరుషం, సంస్కృతికి ప్రతీకలైన "సమ్మక్క సారలమ్మ"లను అవమానపరిచిన త్రిదండి చినజీయర్‌ని యాదగిరిగుట్ట ఆగమశాస్త్ర సలహాదారుడి బాధ్యతల నుండి తక్షణమే కేసీఆర్ తొలగించాలి.. రేవంత్ రెడ్డి..మన భక్తి విశ్వాసాలపై దాడి చేసినందుకు చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## దేశాన్ని పంటకాలనీలుగా విభజించాలి

### తెలంగాణలో పంట మార్పిడి కోసం మహారాష్ట్ర పర్యటనలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి బృందం



- పంటల మార్పిడితో రైతులు లాభాలు
- రైతుకు సాయం చేయాల్సిన కేంద్రం చేటు చేస్తుందన్న మంత్రి
- భవిష్యత్ తరాలు వ్యవసాయం వైపు మళ్లాలి
- యువత వ్యవసాయంలో తమదైన ముద్ర వేయాలి
- మహారాష్ట్ర జాల్నా ప్రాంతంలో వ్యవసాయ ఉద్యాన పంటల పరిశీలన
- రైతులతో సమావేశమైన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి బృందం

**హైదరాబాద్, మార్చి18(అక్షర వెలుగు డెస్క్):** దేశంలో రైతు కష్టానికి తగిన ఫలితం దక్కాలంటే దేశంలో ఏ పంట ఎంత అవసరం అన్న ప్రణాళిక ఉండాలని మంత్రి నిరంజన్ రెడ్డి అన్నారు. శుక్రవారం పర్యటనలో భాగంగా వివిధ వ్యవసాయక్షేత్రాలను తన బృందాలు పరిశీలించాయి. మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లడుతూ.. దేశాన్ని పంట కాలనీలుగా విభజించి పంటల సాగుకు మార్గదర్శనం చేయాలని, రైతుకు న్యాయం జరిగేలా ఉండాలి .. రైతుకు ఎంత చేసినా తక్కువే, పంటల మార్కెటింగ్, ఎగుమతుల విషయంలో రైతుకు సాయం చేయాల్సిన కేంద్రం చేటు చేస్తున్నదని అరోపించారు. భవిష్యత్ తరాలు వ్యవసాయం వైపు మళ్లాలని హితవుపలికారు. యువత వ్యవసాయంలో తమదైన ముద్ర వేయాలని, తెలంగాణలో పంటల వైవిద్యీకరణ కోసం పెద్ద ఎత్తున కృషిచేస్తున్నామని, ముఖ్యమంత్రి కేసీఆర్ రైతులకు రైతుబంధు, రైతుభీమా, 24 గంటల కరంటు ఇస్తూ వ్యవసాయానికి వెన్నుదన్నుగా నిలుస్తున్నారు అని తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో ఏడేళ్లలో తెలంగాణ వ్యవసాయ స్వరూపం సమూలంగా మారిపోయింది అని పంటల మార్పిడితో రైతులు లాభాలు గడించాలన్నది మా ఉద్దేశం అని అన్నారు. మహారాష్ట్ర జాల్నా ప్రాంతంలో వ్యవసాయ ఉద్యాన పంటల పరిశీలనకు వచ్చాం, తెలంగాణలో పంట మార్పిడి కోసం ఇప్పటికే కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు పర్యటించడం జరిగింది. వ్యవసాయ, ఉద్యాన పంటలు, వాటి ఆధారిత పరిశ్రమలు, ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల పరిశీలనకు మహారాష్ట్ర పర్యటనలో భాగంగా అహ్మద్ నగర్ జిల్లా శిరిడీ సమీపంలో ద్రాక్ష, జామ తోటలు పరిశీలించి స్థానిక వ్యవసాయ, ఉద్యాన అధికారులు, రైతులతో సమావేశమైన రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ఎమ్మెల్యేలు బాల్క సుమన్, గండ్ర వెంకట రమణా రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి, ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామ్ రెడ్డి, ఉద్యానశాఖ జేడి సరోజినిదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి తదితరులు, షిరిడీ ప్రాంతంలో వర్షపాతం వివరాలు, పంటల రకాలు, సాగునీటి వసతి, పంటల మార్కెటింగ్ పై రైతులతో ఆరా తీశారు. మహారాష్ట్ర పర్యటనలో భాగంగా అహ్మద్ నగర్ జిల్లా షిరిడి సమీపంలో వ్యవసాయ క్షేత్రాలు, ఉద్యాన ఆధారిత పరిశ్రమలు మరియు ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రివర్యులు సింగిరెడ్డి నిరంజన్ రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగింది. ఈ పర్యటనలో పాల్గొన్న సహచర శాసనసభ్యులు గండ్ర వెంకటరమణా రెడ్డి, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఆల వెంకటేశ్వర్ రెడ్డి గార్లు మరియు ఉద్యానశాఖ డైరెక్టర్ వెంకట్రామ్ రెడ్డి, ఉద్యానశాఖ జేడీ సరోజినిదేవి, అసిస్టెంట్ డైరెక్టర్ సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

## ప్రగతి బాటలో తెలంగాణ విద్యా వ్యవస్థ

**ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత**



**హైదరాబాద్,మార్చి18(అక్షర వెలుగు):** తెలంగాణ ఉద్యమకారిణి జయచంద్రిక ఉన్నత విద్యకు ఎమ్మెల్సీ కవిత చేతుల మీదుగా రూ.5 లక్షల ఆర్థిక సాయం అందజేత జయచంద్రికకు ఆర్థిక సాయం అందించిన మనికొండ రంజీత్ ను అభినందించి రాష్ట్రంలో టీఆర్ఎస్ ప్రభుత్వ కృషితో విద్యా వ్యవస్థ పూర్తిగా మెరుగుపడిందన్నారు. హైదరాబాద్ లోని నివాసంలో జయ చంద్రిక అనే తెలంగాణ ఉద్యమకారిణి ఉన్నత విద్యకు గాను రూ.5 లక్షల ఆర్థిక సాయాన్ని అందజేశారు. ప్రతి జిల్లాలో పెద్ద సంఖ్యలో గురుకుల పాఠశాలలు ఏర్పాటు చేసి రాష్ట్ర ప్రభుత్వం, అన్ని స్థాయిల్లో అత్యున్నత విద్యా సౌకర్యాలు ఏర్పాటు చేసిందని తెలిపారు. దాంతోపాటు విదేశీ విద్యకు సైతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్థిక చేయూతనిస్తోందని గుర్తు చేశారు. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లీష్ మీడియం విద్యను అందించనుండటం బాలబాలికల ఉన్నత భవిష్యత్తుకు బంగారు పునాదులు వేస్తుందని తెలిపారు. జయచంద్రిక బాల్యం నుండి తెలంగాణ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నారు. ఉద్యమ వేళ తెలంగాణ తల్లి వేషాధరణతో జయచంద్రిక ప్రతి సమావేశంలోనూ ఆకర్షణీయంగా నిలిచిందని గుర్తు చేశారు. జయచంద్రికకు ఆర్థిక సాయం అందించిన మనికొండ రంజీత్ ను అభినందించారు.

## కేసీఆర్ దొంగ హామీలతో జాగ్రత్త

### ప్రజాప్రస్థానం యాత్రలో వైయస్ షర్మిళ ఫైర్

- రైతు ఆత్మహత్యలకు కేసీఆరే కారణం
- బంగారు తెలంగాణ పేరు చెప్పి అప్పుల తెలంగాణ చేసిండు
- భూములు, మద్యం అమ్మకాలపైనే ముఖ్యమంత్రి దృష్టి
- మేం అధికారంలోకి వస్తే మహిళలందరికీ ఇండ్లు
- ఇంటిల్లిపాది అర్హులందరికీ పెన్షన్లు ఇస్తాం
- చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగం కల్పిస్తాం
- చేనేత కార్మికులకు రుణమాఫీ చేస్తాం
- చేనేత యంత్రాలకు ఉచిత విద్యుత్ పంపిణీ చేస్తాం
- సబ్సిడీపై ముడి సరుకులు అందజేస్తాం
- రాయితీపై లోన్లు మంజూరు చేసి ఆదుకుంటాం



**హైదరాబాద్, మార్చి 18 (అక్షరవెలుగు):** ప్రజాప్రస్థానంలో భాగంగా వైయస్ఆర్ తెలంగాణ పార్టీ అధినేత్రి వైయస్ షర్మిల గారు 29వ రోజు పాదయాత్ర ఉమ్మడి నల్లగొండ జిల్లా భువనగిరి నియోజకవర్గం పోచంపల్లి మండలం మార్కొండేయ నగర్ లో ప్రారంభించారు. హోళీ పండుగ సందర్భంగా , మహిళలతో కలిసి కాసేపు హోళీ ఆడారు. ఆ తర్వాత ముక్తాపూర్ గ్రామానికి పాదయాత్ర చేరింది. అక్కడ గ్రామస్తులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. మహిళలు, వృద్ధులు వారు పడుతున్న కష్టాల గురించి చెప్పుకుంటూ కంటతడి పెట్టారు. వారికి భరోసా కల్పించి వైయస్ షర్మిల గారు ముందుకు సాగారు. అనంతరం చింతబావి గ్రామానికి యాత్ర చేరుకుంది. ఈక్రమంలో చేనేత కార్మికులు పడుతున్న కష్టాల గురించి తెలుసుకున్నారు. మగ్గం నేసే విధానాన్ని పరిశీలించారు. వారి కష్టాన్ని తెలుసుకున్నారు. అనంతరం పాదయాత్ర బసవలింగేశ్వర స్వామి కాలనీకి చేరుకుంది. మహిళలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి, స్వాగతం పలికారు. ఆ తర్వాత పాదయాత్ర రేవనపల్లి, గౌస్ కొండ గ్రామాల మీదుగా సాగింది. అక్కడి నుంచి పెద్దరావుల పల్లె గ్రామానికి చేరుకుంది. ఆ తర్వాత బట్టుగూడ గ్రామంలో మాట-ముచ్చట కార్యక్రమం నిర్వహించారు. ప్రజా సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వైయస్ షర్మిల గారు మాట్లాడుతూ.. మహానేత వైయస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 6 లక్షల మంది రైతులకు రుణమాఫీ చేశారు. రైతులకు ఉచిత విద్యుత్ ప్రవేశపెట్టిన మొట్టమొదటి నాయకుడు వైయస్ఆర్. పేదింటి బిడ్డలకు ఫీజు రీయింబర్స్ మెంట్ ఇచ్చి, ఉన్నత చదువులు చదివించారు. ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత వైద్యం అందించారు. 108, 104 సేవల ద్వారా ఇంటి వద్దకే ఆరోగ్య సేవలు అందించారు. ఐదేండ్లలో మూడుసార్లు నోటిఫికేషన్లు వేసి లక్షల ఉద్యోగాలు భర్తీ చేశారు. ప్రైవేటు రంగంలోనూ 11 మందికి ఉద్యోగాలు కల్పించారు. వైయస్ఆర్ పాలనలో నిరుద్యోగులు ఎవ్వరూ ఆత్మహత్యలు చేసుకోలేదు. గ్యాస్ ధరలు, నిత్యావసర ధరలు పెరగలేదు. ఐదేండ్లలో ఒక్క పన్ను కూడా పెంచకుండా అద్భుతమైన పాలన అందించారు. పంట నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించారు. రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ అందించారు. రాయితీపై విత్తనాలు, ఎరువులు అందజేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 46 లక్షల మందికి పక్కా ఇండ్లు నిర్మించారు. జలయజ్ఞం ద్వారా కోటి ఎకరాలకు నీళ్లు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇందుకోసం 86 ప్రాజెక్టులు నిర్మించారు. ఇప్పుడున్న కేసీఆర్ మాత్రం మోసపూరిత హామీలు ఇస్తూ ప్రజలను దగా చేస్తున్నారు. రైతులు ఏ పంట వేయాలో కేసీఆరే డిసైడ్ చేస్తుండు. రైతులకు ఇన్ పుట్ సబ్సిడీ ఇవ్వడం లేదు. ఇన్సూరెన్స్ కూడా ఇవ్వడం లేదు. కేవలం 3లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేసి, 36లక్షల మందికి ఎగ్గొట్టాడు. కేసీఆర్ ఒక్క మాటా నిలబెట్టుకోలేదు. దళితున్ని ముఖ్యమంత్రిని చేస్తా(మిగతా 2వ పేజీలో)

# సంపాదకీయం

## ఇంకెన్నాళ్లీ నదీ జల వివాదాలు !

దేశంలో నదులు అనేకం ఉన్నా..వాటి నీటిని సక్రమంగా వినియోగించుకోక పోవడంతో దేశంలో ఇప్పటికీ అనేక ప్రాంతాలు మంచినీటి కొరతను ఎదుర్కొంటున్నాయి. నదుల అనుసంధానంపై జాతీయ విధానం లేకపోవడంతో ఇన్నేళ్లయినా నీటికటకటలు తప్పడం లేదు. ఈ దశలో కేంద్రం నదీజలాల పంపిణీని సీరియస్‌గా తీసుకోవాలి. ఇది జాతీయ సమస్యగా చూడాలి. తక్షణ సమస్యగా పరిగణించాలి. కావేరీ, కృష్ణా వివాదాలు ముదరక ముందే ఓ నిర్ణయం తీసుకుని జాతీయ జలవిధానానికి శ్రీకారం చుట్టాలి. భవిష్యత్ యుద్దాలకు అడ్డుకట్ట వేయాలి. తెలంగాణ సిఎం కెసిఆర్ చెప్పినట్లుగా నదీజలాల లభ్యతను దృష్టిలో పెట్టుకుని అనుసంధానానికి పూనుకోవాలి. ఏటా వేసవి వస్తోందంటే మంచినీటికి కటకటలు తప్పడం లేదు. మంచినీటికి దిక్కు ఉండడం లేదు. ఈ యేడాది భారీగా వర్షాలు కురిసినా ఇప్పుడు పల్లెలు, పట్టణాల్లో మళ్లీ నీటి కొరతకు సంబంధించిన ఆందోళనలు కానవస్తున్నాయి. నదీజలాల విషయంలో జాతీయ విధానం తీసుకుని రావడంలో పాలకులు విఫలమయ్యారు. దేశంలోని నదీజలాల లభ్యత, పంపకాలను పరిశీలిస్తే జాతీయ జలవిధానం అవసరమన్న విషయాన్ని కేంద్రం గుర్తించడం లేదు. ఈ దేశంలో ఉన్న జలాలపై దేశప్రజలందరికి సమాన హక్కులు ఉండాలి. రైతులకు సమాన వాటా రావాలి. అలాగే నీటిని ఒడిసి పట్టే విధానాలు విస్మరించడం వల్ల ఏటా మంచినీటి కొరతలు వేదిస్తున్నాయి. దీంతో సాగు,తాగునీటికి ఏటా కటకట తప్పడం లేదు. జాతీయ జల విధానం రూపొందించి నదీ జలాల సమగ్ర వినయోగం జరిగివుంటే దేశంలో కరవు తాండవించేది కాదు. ఇప్పటికే కావేరీ జలాల విషయమై కర్ణాటక, తమిళనాడు సిగపట్లు పడుతున్నాయి. తాజాగా విభజిత తెలుగు రాష్ట్రాల విషయంలో నదీజలాల వివాదం కొనసాగుతోంది. ఈ సమస్య రాగానే ఉభయ రాష్ట్రాలు భగ్గుమంటున్నాయి. కృష్ణా నదీ జలాల పంపిణీలో ఉభయ తెలుగు రాష్ట్రాలకూ అన్యాయం జరిగింది. కర్నాటక పైన ఆల్మట్టి, నారాయణపూర్ రిజర్వాయర్లు కట్టడంతో కిందికి చుక్కనీరు రాని పరిస్థితి ఏర్పడింది. వరదలు వస్తే తప్ప నీరు రాని దుస్థితి ఏర్పడింది. తాజాగా ఇప్పుడు కృష్ణాలో తాగునీటి అసవరాలకు కూడా నీరు అందని దుస్థితి ఏర్పడింది. ఈ రకమైన వివాదాల్ని ముమ్ముందు నివారించే దిశగా కేంద్రం, ట్రిబ్యునళ్లు సహకరించాలి. తుదితీర్పు వచ్చేలోగా తెలుగు రాష్ట్రాలు సమర్థ వంతమైన వాదనతో తమ న్యాయమైన హక్కుల్ని కాపాడుకోవాల్సిన అవసరముంది. ఇవన్నీ పరిష్కారం కావాల్సిన సమయంలో కేంద్రం కూడా సమభావనతో ఉండాలి. ఆల్మట్టి,నారాయణపూర్‌లను కట్టుకుని నీటిని వాడుకుంటున్న కర్నాటక తీరువల్ల కిందికి చుక్కనీరురాని పరిస్థితి ఏర్పడింది. కొత్తగా తెలంగాణ ఏర్పడ్డ కారణంగా ఇప్పుడు నీటిని అన్ని రాష్ట్రాలు సమానంగా పంచుకునేలా తీర్పు ఉండాలి. అప్పుడే న్యాయం జరగగలదు. తెలంగాణ, ఆంధ్ర సమస్యగా ఉద్వేగాలతో ముడిపెట్టకుండా రెండు తెలుగు రాష్ట్రాలు సమన్వయంతో పని చేయాలి.

ఎడిటర్

## కేసీఆర్ దొంగ హామీలతో జాగ్రత్త

(మొదటి పేజీ తరువాయి..) నన్నడు. మూడెకరాలు భూమి ఇస్తానన్నడు. డబుల్ బెడ్ రూం ఇండ్లు ఇస్తానన్నడు. కేసీఆర్ ను నమ్మి, ముఖ్యమంత్రిని చేస్తే బంగారు తెలంగాణ పేరుతో బారుల తెలంగాణ, బీరుల తెలంగాణ చేశాడు. వైయస్ఆర్ ఉన్నపుడు మహిళలకు పావలా వడ్డీకే రుణాలు ఇచ్చారు. కేసీఆర్ మాత్రం మహిళలకు కనీసం రుణాలు కూడా ఇవ్వడం లేదు. కేసీఆర్ పాలనలో ఏ ఒక్కరూ సంతోషంగా లేరు. బీసీలకు గొర్రెలు, బర్రెలు ఇచ్చి కాచుకోమంటున్నాడు. వందలాది మంది నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటున్నా.. దున్నపోతు మీద వాన పడ్డట్టుగా కేసీఆర్ లో మాత్రం చలనం లేదు. చస్తే చచ్చారులే.. ఉద్యోగాలు అడిగేవారు ఉండరని కేసీఆర్ అనుకుంటున్నాడు. తెలంగాణలో ఇలాంటి దౌర్భాగ్య పరిస్థితి మారాలి. ప్రజల్లో చైతన్యం రావాలి. ప్రజా సమస్యలను ఎత్తిచూపడానికే మేం పాదయాత్ర చేపడుతున్నాం. ప్రభుత్వం మెడలు వంచేందుకే మా పోరాటం. మేం పార్టీ పెట్టక ముందే తెలంగాణ తల్లి సాక్షిగా నిరుద్యోగుల కోసం మూడు రోజులు నిరాహార దీక్షలు చేశాం. పోలీసులతో మా పోరాటాన్ని అణచివేయడానికి మా చేయి విరగ్గొట్టారు, బట్టలు చింపారు. మహిళ అని కూడా చూడకుండా అవమానపరిచారు. మమ్మల్ని ఎంత అణచివేసినా నిరుద్యోగుల కోసం మా పోరాటాలు ఆపలేదు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలకు నోటిఫికేషన్లు వేయాలని డిమాండ్ చేస్తూ ప్రతి మంగళవారం నిరుద్యోగ నిరాహార దీక్షలు చేస్తున్నాం. ప్రజా ప్రస్థానం పాదయాత్రలో కూడా మా నిరాహార దీక్షలు కొనసాగిస్తున్నాం. మేం ఇంతటి పోరాటం చేయడం వల్లనే కేసీఆర్ గారు నేడు ఉద్యోగాల నోటిఫికేషన్ల గురించి మాట్లాడారు. వైయస్ఆర్ తెలంగాణ పార్టీ పోరాటాల ఫలితమే నిరుద్యోగులకు నోటిఫికేషన్లు. ఈ ఘనత కేవలం వైయస్ఆర్ తెలంగాణ పార్టీకే దక్కుతుంది. నిరుద్యోగులు డిగ్రీలు, పీజీలు చదివి సమాజంలో తలెత్తుకోలేక , తల్లిదండ్రులకు భారం కాలేక ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. చనిపోయిన నిరుద్యోగుల కుటుంబాలను పాలకులు ఎవరైనా పరామర్శించారా? ఎంతోమంది రైతులు అప్పులపాలై ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. రాష్ట్రంలో రోజు ఎక్కడో ఓ చోట ఇద్దరు ముగ్గురు ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. ఈ చావులకు ఎవరు కారణం . ఆ కుటుంబాలను ఎవరు ఆదుకుంటున్నారు? బంగారు తెలంగాణ అని చెప్పి అప్పుల తెలంగాణ గా , ఆత్మహత్యల తెలంగాణగా మార్చారు. ఉద్యమ కారుడు కదా అని కేసీఆర్ గారి చేతికి రాష్ట్రం అప్పగిస్తే బార్ల తెలంగాణగా , బీర్ల తెలంగాణ గా మార్చారు. ఈ రోజు రాష్ట్రం నడవాలంటే మద్యం అమ్మాలి , లేదంటే భూములు అమ్ముకుంటూ పోవాలి. ఆఖరికి కేసీఆర్ గారు తెలంగాణ ప్రజలు, రాష్ట్రాన్ని కూడా అమ్మేస్తారు. కానీ కేసీఆర్ గారు, ఆయన కుటుంబం మాత్రం సల్లగా ఉండాలే. ఆయన కుటుంబానికి ఉద్యోగాలు , ప్రజలకేమో ఆత్మహత్యలా? కాళేశ్వరం లాంటి పెద్దపెద్ద ప్రాజెక్టులు చేయాలే ఆ కమీషన్లు తినాలే వాళ్లు మాత్రం బాగుండాలి. తెలంగాణ ప్రజలు మాత్రం ఆత్మహత్యలు చేసుకోవాలా? ఇప్పుడు కేసీఆర్ కు రెండుసార్లు అధికారం ఇస్తే ఏం చేశారు? రాష్ట్రంలో కేసీఆర్ మోసం చేయని



వర్గం లేదు. రుణమాఫీ చేస్తానని రైతులను మోసగించారు. సున్నా వడ్డీకే రుణాలు ఇస్తామని మహిళల్ని మోసగించారు. ఇంటికో ఉద్యోగం అని చెప్పి నిరుద్యోగులను మోసం చేశారు. కేజీ టూ పీజీ ఉచిత విద్య అని విద్యార్థులను మోసం చేశారు. ఇంటికో ఉద్యోగం ఇవ్వకపోతే ప్రతి నిరుద్యోగికి నిరుద్యోగ భృతి ప్రతి నెలా రూ.3016 ఇస్తానని మోసం చేశారని షర్మిల అన్నారు. ఆఖరి గింజ వరకు వరి కొంటా అన్నాడు ఈ రోజు వరి కొనను అంటున్నాడు.
- మైనార్టీలకు 12 శాతం రిజర్వేషన్ ఇస్తామని మోసం చేశాడు. ఎస్సీలకు మూడెకరాల భూమి ఇస్తామని మోసం చేశాడు. ఎస్టీలకు పోడు పట్టాలు ఇస్తామని మోసం చేశారు. కేసీఆర్ ఇంట్లో అందరికీ ఉద్యోగాలుండాలే ప్రజలేమో ఆత్మహ్యలు చేసుకోవాలా? ఇలా కేసీఆర్ గారు ప్రతి ఒక్క వర్గాన్ని మోసం చేశారు. ఇదేనా బంగారు తెలంగాణ అంటే? తెలంగాణ ప్రజల తరపున పోరాటం చేయడానికే వైయస్ఆర్ తెలంగాణ పార్టీ పుట్టింది. వైయస్ఆర్ సంక్షేమ పాలన మళ్లీ రాష్ట్రంలో తీసుకురావడానికే వైయస్ఆర్ తెలంగాణ పార్టీ పుట్టింది. మళ్లీ వ్యవసాయాన్ని పండుగ చేస్తాం. మహిళలకు మళ్లీ ఆర్థికంగా బలపడేలా రుణాలు ఇస్తాం. మహిళల పేరు మీద ఇల్లు నిర్మిస్తాం. ఇంట్లో ఎంతమంది అర్హులు ఉంటే అంతమందికి పెన్షన్లు ఇస్తాం. ప్రతి పేదవాడికి ఇల్లు కట్టిస్తాం. చదువుకున్న ప్రతి ఒక్కరికీ ఉద్యోగాలు వచ్చేలా చేస్తాం. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ , మహిళలు, రైతులు ,నిరుద్యోగులు, విద్యార్థులు, వికలాంగులకు న్యాయం చేయడం కోసమే మేం వైయస్ఆర్ తెలంగాణ పార్టీ పెట్టాం. కేసీఆర్ గారు రెండు సార్లు ముఖ్యమంత్రి అయ్యి కూడా ప్రజలకు అన్యాయమే చేశారు. గాడిదకు రంగు పూసి, ఆవు అని చెప్పి నమ్మించే రకం కేసీఆర్ గారు. ప్రజలు నమ్మి మళ్లీ మళ్లీ మోసపోవద్దు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ ఓట్లు వేయించుకోవడానికి కేసీఆర్ దొంగ హామీలు ఇస్తాడు. ప్రజలు జాగ్రత్తగా ఉండాలి. మాట తప్పని మడమ తిప్పని రాజన్న బిడ్డను నేను. ఆఖరి క్షణం వరకు మీకు సేవ చేస్తూనే చనిపోయిన రాజన్న బిడ్డను నేను. మళ్లీ వైయస్ఆర్ సంక్షేమ పాలన తీసుకొస్తానని మాటిచ్చి చెబుతున్నా. కేసీఆర్ అవినీతి పాలన పోవాలి. కేసీఆర్ అక్రమ పాలన పోవాలి. కేసీఆర్ ప్రజా వ్యతిరేక పాలన పోవాలి. వైయస్ఆర్ సంక్షేమ పాలన రావాలి. అని షర్మిల ఈ సందర్భంగా అన్నారు.

## యుద్ధంలో జరిగింది అదే .. వీడియో షేర్ చేసిన జెలెన్ స్కీ

**న్యూడిల్లీ, మార్చి 18 (అక్షర వెలుగు):** ఉక్రెయిన్ పై రష్యా చేస్తున్న సైనిక చర్య ఇప్పటికే చాలా విధ్వంసాన్ని సృష్టించింది. అనేక నగరాల్లో ప్రజలు బాంబు దాడులు క్షిపణి దాడులు ఎప్పుడు జరుగుతాయో అని బిక్కు బిక్కు మంటూ జీవనం సాగిస్తున్నారు. ఇప్పటి వరకు జరిగిన దాడుల్లో ఉక్రెయిన్ లోని చాలా ప్రాంతాల ధ్వంసం అయ్యాయి. దీంతో నగరాల్లో ఉండేందుకు ప్రజలు చాలా భయపడుతున్నారు. రష్యా సైనిక చర్య ప్రారంభించిన నాటి నుంచి చాలా మంది ప్రజలు వివిధ సరిహద్దు దేశాలకు తరలి వెళ్లారు. ఒకరు కాదు ఇద్దరు కాదు.. కొన్ని లక్షల మంది ప్రజలు సరిహద్దులు దాటి ఇతర దేశాల్లో తల దాచుకుంటున్నారు. మరి కొందరు బతికిన చచ్చినా నా దేశంలోనే అంటూ ఉక్రెయిన్ లోనే ఉంటున్నారు. ఇదిలా ఉంటే రష్యా ఇప్పటి వరకు సైనిక చర్యను మాత్రమే ప్రారంభించింది అనుకుంటే పొరపాటే. ఇది పూర్తి స్థాయిలో యుద్ధం అని అందరూ అంటున్నారు. ఇందుకు సాక్ష్యాలుగా రష్యా దాడుల్లో శిధిలమైన నగరాలను చూపిస్తున్నారు. వీటిలో అనేక మంది అమాయకులు అయిన ప్రజలు సైనికులు చనిపోయినట్లు కనిపించే వీడియోలను ఫోటోలను షేర్ చేస్తున్నారు. వాటి రష్యా చేసిన విధ్వంసం స్పష్టంగా కనిపిస్తుంది. ఎన్నో ప్రాంతాల్లో మృతదేహాలు కుప్పలు తెప్పలుగా పడి ఉన్నాయి. ఈ శవాల దిబ్బలు చూసిన ప్రజలు భయపడుతూ బతుకుతున్నారు.అయితే రష్యా చేపట్టిన ఈ సైనిక చర్య కారణంగా తమ దేశం ఎంత



నష్టపోయిందో అని తెలియజేసే ఓ వీడియోను ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్ స్కీ తన అధికారిక సోషల్ మీడియా ఖాతాలో విడుదల చేశారు. ఈ వీడియో లో రష్యా చేస్తున్న యుద్ధం లో యుద్ధంలో ప్రజలు ఎలా సమిధలు అయ్యారు అనేది స్పష్టంగా తెలుస్తోంది. అంతేగాకుండా యుద్ధానికి ముందు ఎలాంటి పరిస్థితి ఉండేది యుద్ధం తరువాత ఎలాంటి పరిస్థితులు ఏర్పడ్డాయి అనేది చాలా స్పష్టంగా వివరిస్తోంది. ఈ వీడియో చూసిన చాలా మంది అయ్యో ఉక్రెయిన్ ఇంత నష్టపోయిందా అని అనుకునేలా ఈ వీడియోను రూపొందిచారు. ఆనాడు దేశంలో ఉన్న పసి పిల్లల బోసి నవ్వులు మాయం అయ్యాయి అని చెప్పే వీడియో ను జెలెన్ స్కీ షేర్ చేశారు. జెలెన్ స్కీ షేర్ చేసిన వీడియో ప్రస్తుతం ఉక్రెయిన్ లో ఉండే అత్యంత భయానక పరిస్థితి కళ్లకు కట్టినట్లు చూపిస్తుంది చెప్తున్నారు. పుతిన్ సేనలు చేసిన దాడుల్లో ఎన్నో భవనాలు కూలిపోయాయి. మరి కొన్ని బూడిద అయ్యాయి. ఆఖరికి కొన్ని ప్రధాన నగరాల్లో ఉండే ఆసుపత్రులు ఎలా దెబ్బతిన్నది... రోగులు ఎదుర్కొంటున్న ఇబ్బందులు ఇలా ఒకటి రెండు అని కాకుండా క్షేత్రస్థాయిలో అసలైన నివేదికను తెలిపేలా ఆ వీడియో ఉంది. ఇదే వీడియో లో చిన్న చిన్న పసికందులను ఎత్తుకొని ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని ఉక్రెయిన్ తల్లులు సరిహద్దులు దాటిన చిత్రాలు కూడా ఉన్నాయి. యుద్ధంలో వీరమరణం పొందిన సైనికులతో పాటు దాడుల్లో ప్రాణాలు పోగొట్టుకున్న వారి సామూహిక ఖననం చేసే లాంటి అత్యంత హృదయ విషాధారక దృశ్యాలు ఉన్నాయి. ఈ వీడియో చూసిన చాలా మంది రష్యా చేసిన సైనిక దాడులు ఇంత భయంకరంగా ఉన్నాయా అని అంటున్నారు. మానవతా హృదయంతో ఉక్రెయిన్ కు సహాయంగా నిలబడాలి అని చెప్తున్నారు. ఇదిలా ఉంటే గురువారం జరిగిన దాడుల్లో రష్యాకు చెందిన ఓ సినీ నటి మరణించింది. నివాస స్థలం పై జరిగిన క్షిపణి దాడిలో ఈమె చనిపోయినట్లు అధికారులు తెలిపారు.

# ప్రాంతీయ పార్టీల్లో ఐక్యత సాధ్యమేనా !

## యూపి ఎన్నికల నుంచి గుణపాఠం నేర్చుకునేనా

## మోడీ అమిత్‌షాల ఊహాలను పసిగట్టగలరా



**న్యూఢిల్లీ, మార్చి 18 (అక్షర వెలుగు):** అయిదు రాష్ట్రాల ఎన్నికల ఫలితాల తర్వాత ప్రతిపక్షాలు మోదీని ఎదుర్కొనే విషయంలో వెనక్కి తగ్గుతాయనే భావించాలి. మునుపటి దూకుడును ప్రదర్శించకపోవచ్చు. ఎందుకంటే కాంగ్రెస్ పునాదులతో పెకిలించి కూలబడుతోంది. కాంగ్రెస్‌ను నామరూపాలు లేకుండా చేస్తున్న బిజెపి ప్రాంతీయ పార్టీలను నిర్మూలించడంపై ఎప్పుడో దృష్టి సారించింది. తమ అస్తిత్వం కాపాడుకోవడానికై కెసిఆర్ ఇప్పటికే పోరాటం చేపట్టారు.ప్రాంతీయ పార్టీలు తమ ప్రయోజనాలను కాపాడుకోవడానికైనా కలిసికట్టుగా వస్తాయన్న భావన లేదు. ఈ ఏడాది గుజరాత్, హిమాచల్ ప్రదేశ్ లలోనూ, వచ్చే ఏడాది మధ్యప్రదేశ్, రాజస్థాన్, కర్ణాటక, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లోనూ ఎన్నికలు జరుగనున్నాయి. బిజెపి దూకుడును అడ్డుకోవాలంటే ముందుగా ఆ పార్టీ ప్రత్యర్థులు తాము అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో ప్రజలపై,పాలనపై దృష్టి కేంద్రీకరించాలి. బిజెపిని ఎదుర్కోవడానికి వాటికి సమిష్టి పోరాటం అవసరం. యూపి అనుభవం నుంచి ఆయా ప్రాంతీయ పార్టీలు పాఠాలు నేర్చుకోవాలి. గత ఎనిమిది సంవత్సరాల్లో తరచూ వస్తోన్న ఎన్నికల్లో బిజెపి విజయం సాధించడం చిన్న విషయం కాదు. మళ్లీ మళ్లీ బిజెపికి ఓటు ఎందుకులే అన్న నిరాసక్తత జనంలో రాకుండా బిజెపి చూసుకుంటోంది. ఓటింగ్‌కు వెళ్లాలి, బిజెపిని గెలిపించాలి అన్న ఒకరకమైన భావనను బిజెపి బలంగా ప్రచారం చేస్తోంది. కేవలం సామాజిక సమీకరణాలే కాకుండా, క్షేత్ర స్థాయి నుంచి పనిచేసే బలమైన సంస్థాగత శక్తిని బిజెపి పటిష్టం చేసుకుంటూ పోతోంది. గోరంత అభివృద్ధిని కొండంతగా.. గోరంత పనులను కొండంతగా భూతద్దంలో చూపే ప్రయత్నాలు నిరంతరం సాగుతున్నాయి. బిజెపితో తమకేమి ఒరిగిందిలే అని సామాన్య ప్రజలు భావించకుండా నిరంతరాయంగా వారిని బిజెపి మూడ్‌లోకి తీసుకుని వచ్చే యత్నాలు సోసల్ మీడియా ద్వారా చేస్తూనే ఉన్నారు. ఈ మంత్రం తెలిసినందువల్ల వారిని లబ్దిదారులుగా గుర్తించి నిరంతరాయంగా బిజెపి నేతలు వారిపైనే దృష్టి కేంద్రీకరించారు. అన్నిటికంటే ముఖ్యమైన విషయమేమిటంటే బిజెపిలో ఎలాంటి లుకలుకలు లేవు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కాదు, జాతీయ, రాష్ట్ర పార్టీలు కూడా కలిసికట్టుగా పనిచేసేలా చూసుకుంటున్నారు. లాగే నరేంద్రమోడీ తీసుకునే ప్రతి నిర్ణయాన్ని క్షేత్రస్థాయిలో సమర్థించేలా వాతావరణం సృష్టిస్తున్నారు. వ్యతిరేకత రాకుండా మసిపూసి మారేడుగాయ చేస్తున్నారు. అందుకే రాజకీయ క్రీడలో ప్రధానమంత్రి నరేంద్రమోదీని మించినవారు లేరని ఇటీవలి నాలుగు రాష్ట్రాల ఎన్నికల ఫలితాలు నిరూపించాయి. అందుకే వారసత్వ రాజకీయాలు లేవని ప్రచారం మొదలయ్యింది. నేనే టిక్కట్లు నిరాకరించానని ప్రధాని ఘంటాపథంగగా చెప్పారు. ఉత్తర ప్రదేశ్ ఎన్నికల్లో సమాజ్‌వాది పార్టీ నేత అఖిలేశ్ యాదవ్ కూడా అనేక ఎత్తులు వేసినా మోడీ ఎత్తుల ముందు ఫలించలేదు. యాదవులు, ముస్లిం లు సంఘటితంగా ఓటు వేస్తే ఎన్నికల్లో విజయం తనదేనని ఆయన ప్రగాఢంగా నమ్మారు. రాష్ట్రం నలు మూలలా ఏడు చిన్న చిన్న పార్టీలతో పొత్తు పెట్టుకున్నారు. రకరకాల కులసమీకరణలు చేశారు. అక్కడితో ఆగకుండా బిజెపి శిబిరంలో ఉన్న స్వామిప్రసాద్ మౌర్య, దారాసింగ్ చౌహాన్ లాంటి వారికి వల వేశారు. యాదవేతర బీసీల్లో కుర్మీలకు అధిక సీట్లు ఇచ్చారు. ముస్లిం ఆధిపత్యం ఉన్న చోట్ల కూడా వారికి సీట్లు ఇచ్చి బిజెపి అభ్యర్థి ఓట్లను చీల్చేందుకు ప్రయత్నించారు. అఖిలేశ్ యాదవ్ ఎత్తుగడలను ఎదుర్కోవడం బిజెపికి పెద్దగా కష్టం కాలేదు. ఎందుకంటే ఎన్నికల సమీకరణాల్లో వారు ఆరితేరారు. ఎంత కష్టపడ్డప్పటికీ ఉత్తరప్రదేశ్ వ్యాప్తంగా సమాజ్‌వాది పార్టీ ప్రభావం చూపలేదన్న విషయం స్పష్టమైంది. మోదీ, యోగీ కెమిస్ట్రీ, డబుల్ ఇంజిన్ ప్రభుత్వం వంటివి బాగా కలసి వచ్చాయి. ప్రియాంకాగాంధీ 40 శాతం మహిళలకు సీట్లు ఇచ్చినప్పటికీ మహిళలు అత్యధిక శాతం బిజెపికి ఓటు వేశారని సిఎస్ డిఎస్ అంచనాలు వెల్లడించాయి. ఆమె గంగాయాత్రలు కూడా ఫలించలేదు, రాయబరేలీ, అమేథీల్లో కూడా ఆమె పార్టీని గెలిపించలేకపోయారు. ప్రియాంక హవా ఏమీ లేదని తెలిసిన జితిన్ ప్రసాద, ఆర్‌పీఎన్ సింగ్ లాంటి నేతలు బిజెపి వైపు మొగ్గు చూపారు. మొత్తంగా ఈ దెబ్బతో యూపిలో కాంగ్రెస్ హవా మొత్తం పడిపో యింది. ప్రియాంక ఇక నేషనల్ పాలిటిక్స్‌లో కూడా పనికిరాదని తేలిపోయింది.కపిల్ సిబల్ లాంటి వారు గాంధీలు దిగి పోవాలని కోరుకుంటున్నారు. యోగీ పరిపాలనా తీరు కూడా బాగా పనిచేసింది. ఈ క్రమంలో ఇప్పుడు అకిలేశ్ గెలిచిన వారిలో ఎంతమంది ఆయన వెంట ఉంటారన్నది కూడా అనుమానమే. ఎంతమంది బిజెపి మందలో దూకుతారో కూడా చెప్పడం కష్టమేమీ కాదు. నరేంద్రమోదీ, అమిత్‌షాలు ఎన్నికల వ్యూహంలో దిట్టలు. యూపీ ఎన్నికల ఫలితాలు ప్రకటించి 24 గంటలు కాకముందే నరేంద్రమోదీ గుజరాత్‌కు వెళ్లి రెండు రోజులు అక్కడే గడిపారు. అహ్మదాబాద్‌లో రోడ్ షోలో పాల్గొన్నారు. ఇవన్నీ డిసెంబర్‌లో గుజరాత్‌లో జరిగే ఎన్నికలకు నాంది ప్రస్తావనలుగా భావించాలి.

# 111 జీవోను ఎత్తివేస్తామన్న కేసీఆర్


## భూముల ధరలకు రెక్కలొచ్చే చాన్స్

**111 జీవో ఎత్తివేస్తే మారనున్న భూముల విలువలు**

**ఐటీ సంస్థలు, రియల్ కంపెనీల దృష్టి పడే అవకాశం**

**జీవో పరిధిలోని ప్రాంతాల్లో రేట్లు చుక్కలనంటుతాయనే చర్చ**

**ప్రస్తుతం హాట్ కేక్‌లుగా ఉన్న ప్రాంతాల్లో ధరలు స్థిరంగా ఉండే అవకాశం**




**హైదరాబాద్, మార్చి18(అక్షర వెలుగు):** జీవో 111 ఎత్తివేత ప్రభావం భూముల విలువలపై దీర్ఘకాలం పాటు కొనసాగే అవకాశాలు కనిపిస్తున్నాయి. జాతీయ, అంతర్జాతీయ ఐటీ సంస్థలు, ప్రముఖ రియల్ ఎస్టేట్ కంపెనీల దృష్టి జీవో 111 ప్రాంతాలపై పడనుండడం జీహెచ్‌ఎంసీ పరిధిలోని ఇతర ప్రాంతాల భూలావాదేవీలపై ప్రభావం చూపనుంది. ఈ జీవో ఎత్తివేస్తామని సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించిన నేపథ్యంలో.. జీవో పరిధిలోనికి వచ్చే ప్రాంతాల్లో అప్పుడే భూముల ధరలకు రెక్కలు రాగా అవి చుక్కలనంటుతాయనే చర్చ జరుగుతోంది. శంకర్‌పల్లి, చేవెళ్ల, శంషాబాద్, మొయినాబాద్, రాజేంద్రనగర్, షాబాద్ మండలాల్లో ప్రస్తుతం గరిష్టంగా ఎకరం ధర రూ.5 కోట్ల నుంచి రూ.10 కోట్ల వరకు పలుకుతుండగా సమీప భవిష్యత్తులోనే అది రూ.15%--%20 కోట్ల వరకు పెరగనుందని రియల్ నిపుణులు అంచనా వేస్తున్నారు. అదే సమయంలో ప్రస్తుతం గజం రూ.లక్షకు పైగా పలుకుతున్న కొండాపూర్, గచ్చిబౌలి, మాదాపూర్, కోకాపేట, నార్సింగి (ఐటీ కారిడార్) వంటి ప్రాంతాలతో పాటు రాజధాని నలుదిక్కులా ఉండే ఇతర శివార్లలో కొంత స్తబ్దత నెలకొనే అవకాశముందని అంటున్నారు. జీవో పరిధిలో 84 గ్రామాలు ఉండగా వీటి పరిధిలో 1,32,600 ఎకరాల భూమి ఉంది. ఇందులో 18,332 ఎకరాలు ప్రభుత్వ, 9,235 ఎకరాల అసైన్డ్, 2,660 ఎకరాల సీలింగ్, 1,256 ఎకరాల భూదాన, ఇలా.. మొత్తం 31,483 ఎకరాల ప్రభుత్వ భూము లు ఉన్నాయి. 111 జీవో ఎత్తివేయడం, సవ రించడం వల్ల ఆ భూములన్నీ అందుబాటులోకి వచ్చే అవకాశం ఉంది. ఈ భూములను చేజిక్కిం చుకుని తమ సంస్థలను నెలకొల్పాలని జాతీయ, అంతర్జాతీయ ఐటీ అనుబంధ సంస్థలు, రియల్ ఎస్టేట్ కంపెనీలు భావిస్తున్నాయి. వాస్తవానికి హైదరాబాద్ విస్తీర్ణం 217 చదరపు కిలోమీటర్లు కాగా, అదే 111 జీవో పరిధిలోని భూ విస్తీర్ణం 538 చ.కి.మీ.గా ఉంది. అంటే హైదరాబాద్ విస్తీర్ణం కంటే.. జీవో ఎత్తివేత, సవరణల కారణంగా అందుబాటులోకి వచ్చే భూవిస్తీర్ణమే అధికం అన్నమాట. న్యాయపరమైన చిక్కులు లేకుండా, ఓ ప్రణాళిక బద్ధంగా, పర్యావరణహితంగా సరికొత్త మాస్టర్‌ప్లాన్‌తో ప్రభుత్వం ముందుకెళ్తే..హైదరాబాద్ లాంటి మరో అద్భుత, అహ్లాదకరమైన నగరం కళ్ల ముందు ఆవిష్కృతమయ్యే అవకాశం ఉంది. అంతేకాదు పెద్దయెత్తున భూమి అందుబాటులోకి రానుండటంతో ఇప్పటివరకు పలు ప్రాంతాల్లో అడ్డగోలుగా



పెరుగుతున్న భూముల ధరలకు తాత్కాలికంగా కళ్లెం పడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. జీవో కారణంగా ఈ జోన్ పరిధిలోని నిర్మాణాలపై ఆంక్షలు ఉన్నప్పటికీ..గతకొంత కాలంగా ఫాం హౌస్‌ల పేరుతో ఇక్కడ కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారం సాఫీగానే సాగుతోంది. భూముల ధరలకు రెక్కలు రావడంతో శిఖం భూములన్నీ కబ్జాకు గురయ్యాయి. ఇప్పటికే ఇక్కడ అనేక అక్రమ నిర్మాణాలు వెలిశాయి. 426 లే అవుట్లలో 10,907 ఇళ్లు, గ్రామాల్లో 4,527 ఇళు ్ల, 1,920 వాణిజ్య భవనాలు వెలిశాయి. కోర్టు ఆదేశాల మేరకు అధికారులు అప్పుడప్పుడు స్పందించి అక్రమ నిర్మాణాలు కూల్చివేసినా.. ఆగకపోగా మరింత పెరుగుతూనే ఉన్నాయి. దీనికి తోడు స్థానికుల డిమాండ్ నేపథ్యంలో ఈ జీఓను ఎత్తి వేయనున్నట్లు ఇటీవల సీఎం కేసీఆర్ ప్రకటించడంతో భూములకు మరింత డిమాండ్ ఏర్పడింది. ఇలాంటి పరిస్థితుల్లో ఈ భూములు అమ్ముకోవడం కంటే..మరికొంత కాలం ఎదురు చూడటమే ఉత్తమని రైతులు భావిస్తున్నారు. అడ్వాన్సులు తీసుకున్న కొందరు డబ్బులు తిరిగి ఇచ్చేస్తున్నారు. గతంలో ఒక్కో డాక్యుమెంట్ రైటర్ రోజుకు సగటున 10%--%15 రాస్తే..ప్రస్తుతం ఒకటి, రెండు డాక్యుమెంట్లకే పరిమితమవుతుండటం ఇందుకు నిదర్శనం.

# తెలుగు రాష్ట్రాల్లో భానుడి ప్రతాపం

**అధిక ఉష్ణోగ్రతలు నమోదు**



రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎండలు మండుతున్నాయి. సాయంత్రం వరకు ఉదయ భానుడు తన ప్రతాపాన్ని చూపిస్తున్నాడు. ఈ ఏడాది మార్చి నెల నుంచే వేడి సెగలు ఎక్కువైనాయి. ఇదిలావుండగా, ఏప్రిల్ నెల మొదటి వారం నుంచి ఎండలు మరింత తీవ్రం కానున్నాయని, అలాగే వడగాల్పుల ప్రభావం అధికంగా ఉండే అవకాశం ఉందని వాతావరణశాఖ అధికారులు తెలిపారు. దేశంలో అత్యధికంగా తెలంగాణ లో ఎక్కువగా ఎండలు మంటలు పుట్టిస్తున్నాయి. తాజాగా నల్గొండ జిల్లాలో అత్యధికంగా 43.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రత నమోదు అయింది. రానున్న 5 రోజుల పాటు వడగాల్పుల తీవ్రత కూడా అధికంగా ఉండే అవకాశం ఉందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉష్ణోగ్రతల్లో మార్పులు చోటుచేసుకుంటున్నాయి. సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు అధికంగా నమోదవుతున్నాయి. అలాగే రానున్న 2 రోజుల్లో వడగాల్పులు తీవ్రత ఉంటుందని వాతావరం అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా, బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, మార్చి 21 నాటికి తుఫాన్ గా మారనుందని భారతీయ వాతావరణ శాఖ హెచ్చరించింది. మార్చి 23వ తేదీకి బంగ్లాదేశ్, ఉత్తర మయన్మార్ తీరానికి చేరనుందని వాతావరణ శాఖ తెలిపింది.

# మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్ రెడ్డి జన్మదిన శుభాకాంక్షలు తెలిపిన మైనార్టీ నాయకులు



**దోమ, మార్చి 18 (అక్షర వెలుగు):** మాజీ డిప్యూటీ స్పీకర్ మాజీ ఎమ్మెల్యే జన హృదయ నేత కొప్పుల హరీశ్వర్ రెడ్డి జన్మదిన సందర్భంగా బొంపల్లి మైనారిటీ తెరాస నాయకులు హరీష్ రెడ్డి నివాసానికి వెళ్లి ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బొంపల్లి ఉప సర్పంచ్ రఫిక్ పాష మోయిన్ పాష మైనుద్దిన్ బుక్క పాషా తదితరుల పాల్గొన్నారు.

# విఘ్నేశ్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో పేదలకు దుస్తులు పంపిణీ



**నాగార్జునసాగర్, మార్చి 18 (అక్షర వెలుగు):** విఘ్నేశ్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో హెూలీ పండుగను పురస్కరించుకొని శుక్రవారము పైలాన్ కాలనీ లోని 20 మంది పేదలకు చీరలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విఙ్ఞేశ్వర ఆర్కెస్ట్రా వ్యవస్థాపకులు దండు నాగేశ్వర రావు మాట్లాడుతూ పేదలకు వితంతువులకు అనాధలకు శ్రీ విగ్నేశ్వర ఆర్కెస్ట్రా ఆధ్వర్యంలో దుస్తుల పంపిణీ చేస్తున్నామని అన్నారు. మానవ సేవే మాధవ సేవ అన్న నినాదం తో పేదలకు సేవ చేయడం ఎంతో ధన్యత అని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో దండు నాగేశ్వర రావు కళాబృందం, ఆనంద్ పౌలు, మాధవి, మోహన్ రావు, చంద్రమౌళి, చందు తదితరులు పాల్గొన్నారు

# హెూలీ పండుగ సంబరాల్లో పాల్గొన్న ప్రభుత్వ విప్




**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 18 (అక్షర వెలుగు):** హైదరాబాద్ వెంకటాద్రి టౌన్షిప్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్ పినపాక శాసన సభ్యులు భద్రాద్రి కొత్త గూడెం జిల్లా టిఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షులు రేగా కాంతా రావు ఆయన నివాసంలో కుటుంబ సభ్యులు బంధు మిత్రులతో కలిసి హెూలీ సంబరాల్లో పాల్గొన్నారు, హెూలీ సందర్భంగా జిల్లా ప్రజలకు పండగ శుభాకాంక్షలు తెలిపారు, అన్ని వర్గాల ప్రజలను ఒక్కతాటిపై తెచ్చే హెూలీ పండుగ విశిష్టమైనదని, అందరి జీవితాల్లో వెలుగులు విరబూయాలని ఆయన ఆకాంక్షించారు.

### ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో

# చిన్న జీయర్ స్వామి దిష్టి బొమ్మ దహనం



**భద్రాద్రి కొత్తగూడెం, మార్చి 18 (అక్షర వెలుగు):** ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో శ్రీ శ్రీ శ్రీ మేడారం సమ్మక్క సారలమ్మ తల్లులను హేళన చేస్తూ కక్షపూరితమైన వ్యాఖ్యలు చేసిన చిన్న జీయర్ స్వామి దిష్టి బొమ్మ ను దహనం చేయటం జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పినపాక మండలం దేవానగరం లోని పోలిశెట్టి గుట్టమీద వెలిసిన సమ్మక్క సారలమ్మ దేవతలకు ఆదివాసి సంఘాల ఆధ్వర్యంలో దేవరబాల తోలెం నాగయ్య సత్యమ్మ దంపతులు పూజలు చేశారు. ఆదివాసీ సంఘాల నాయకులు దేవతలకు పాలాబిషేకం చేశారు. తదనంతరం నాయకులు మాట్లాడుతూ చిన్న జీయర్ అనే దొంగ స్వామీ ఆసియా లోనే అతిపెద్ద ఆదివాసీ కుంభమేలాగా పిలిచే సమ్మక్క సారాలమ్మ జాతరను వ్యాపార దృక్పథంతో జరుపుతున్నారని సమ్మక్క సారలమ్మలు అసలు దేవతలు కాదని కించపరిచే వ్యాఖ్యలు చేయటం మంచిది కాదని హెచ్చరించారు ధర్మ ప్రచారం పేరుతో వ్యాపారం చేస్తున్న మొదటి వ్యక్తి నీవేనని నీకు వేల కోట్ల ధనం ఎట్లా వచ్చిందని ప్రశ్నించారు సబ్బండ వర్ణాలు పూజించే దేవతలను సమానంగా బావించలేని ఓ దొంగ స్వామీవెయ్యి కోట్ల విలువచేసే సమతా మూర్తి విగ్రహాన్ని ఏ ఉద్దేశం తో ప్రతిష్టించావని దుయ్యబట్టారు చిన్న జీయర్ స్వామి పై ఎసి,ఎస్టి అట్రాసిటి కేసు నమోదు చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని చిన్న జీయర్ స్వామి అక్రమంగా సంపాదించిన ఆస్తులను జాతీయం చేయాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో ఎంపీటీసీ కాయం శేఖర్ జాతీయ ఆదివాసీ గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గొగ్గల ఆర్కే దొర పినపాక మండల అధ్యక్ష, కార్యదర్శులు కొమరం శ్రీను కుర్సం సారయ్య ఆదివాసీ ఐక్య వేదిక అధ్యక్ష, కార్యదర్శులు తోలెం శ్రీను గొగ్గల కృష్ణ ఉద్యోగ సంఘం నాయకులు సోలం అశోక్ కొమరం అరుణబాబు దుబ్బ ముఖేష్ తోలెం జంపయ్య, పోలేబోయిన నరేష్, పాయం సోమయ్య, తోలెం జనార్ధన్ మరియు ఆదివాసీ మహిళలు పెద్దలు గ్రామస్థులు పాల్గొన్నారు.

# ప్రతి కార్యకర్త 2 లక్షల సభ్యత్వం తీసుకోవాలి

### కాంగ్రెస్ పార్టీ నాయకులు ఎండి సద్దాం

**దోమ, మార్చి 18 (అక్షర వెలుగు):** గొడుగొనీ పల్లి గ్రామంలో కాంగ్రెస్ పార్టీ సభ్యత్వ నమోదు జోరుగా కొనసాగుతోంది. పిసిసి అధ్యక్షులు శ్రీ రేవంత్ రెడ్డి గారి పిలుపు మేరకు మార్చ్ 28 వరకు సభ్యత్వ గడువు ముగుస్తున్న కారణంగా గ్రామంలో ప్రతి ఇంటికి తిరిగి సభ్యత్వం చేయడం జరిగింది. అని గ్రామ కాంగ్రెస్ పార్టీ నాయకుడు ఎండి సద్దాం తెలిపారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలో కి వస్తుందని అని తెలిపారు సభ్యత్వం చేసుకున్న ప్రతి కార్యకర్తకు రెండు లక్షల బీమా పథకం వస్తుందని ఆయన తెలియజేశారు.

# కోటగుళ్ల గణపేశ్వరునికి పూలతో ప్రత్యేక అలంకరణ



**గణపురం, మార్చి 18 (అక్షర వెలుగు):** మండల కేంద్రంలోని కాకతీయుల కళా క్షేత్రం శ్రీ భవాని సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ల లో హెూలీ పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం గణపేశ్వరుని మోదుగు పూలతో ప్రత్యేకంగా అలంకరించారు. గత పది సంవత్సరాలుగా కోటగుళ్ళ పరిరక్షణ కమిటీ ఆధ్వర్యంలో హెూలీ పర్వదినం సందర్భంగా గణపేశ్వర స్వామి వారిని మోదుగు పూలతో ప్రత్యేకంగా అలంకరించడం ఆనవాయితీగా వస్తుంది ఈ సందర్భంగా భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులకు అర్చకులు ముసునూరు నరేష్ తీర్థ ప్రసాదాలను అందజేశారు.

### కొమ్మాల, నాగులమ్మ జాతరకు విచ్చేసిన ములుగు

# ఎమ్మెల్యే దనసరి సీతక్క



**ములుగు, మార్చి 18 (అక్షర వెలుగు):** గ్రామంలో వాసం వంశ ఆధ్వర్యంలో కొమ్మాల నాగులమ్మ జాతరలు నిర్వహించగా అట్టి జాతరకు ఏఐసీసీ జాతీయ మహిళ ప్రధాన కార్యదర్శి మరియు ములుగు నియోజకవర్గ ఎమ్మెల్యే దనసరి సీతక్క విచ్చేసి జాతరను సందర్శించి ప్రతి ఒక్కరు సుఖ సంతోషాలతో ఉండాలని కోరుకుంటూ మొక్కులు తీర్చి కానుకలు సమర్పించారు ఈ కార్యక్రమంలో రంగాపూర్ గ్రామ సర్పంచ్ వాసం కన్నయ్య జిల్లా నాయకులు కణతల నాగేందర్ రావు జెట్టి సోమయ్య మాజీ అధ్యక్షుడు కొంపెల్లి శ్రీనివాస్ రెడ్డి పాలడుగు వెంకటకృష్ణ సూదిరెడ్డి జనార్దన్ రెడ్డి పస్రా సర్పంచ్ ముద్దబోయిన రాము చింత క్రాంతి బలుగూరి శ్రీను మద్దినేని వినయ్ వాసం రాము తదితర నాయకులు పాల్గొన్నారు

# ములుగు జిల్లా ప్రజలకు హెూలీ పండుగ శుభాకాంక్షలు

**జిల్లా అధ్యక్షులు నల్లేల కుమారస్వామి**

**ములుగు జిల్లా కేంద్రములో ఘనంగా హెూలీ వేడుకలు**



**ములుగు, మార్చి 18 (అక్షర వెలుగు):** జిల్లా కేంద్రంలోని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఎఐసి హెూలీ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు నల్లేల కుమారస్వామి ఈ కార్యక్రమంలో కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు గొల్ల పెల్లి రాజేందర్ గౌడ్ యూత్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షులు బాణోత్ రవి చందర్ ఫిషర్ మేన్ జిల్లా అధ్యక్షులు కంబాల రవి కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఎండీ చాంద్ పాషా సహకార సంఘం వైస్ చైర్మన్ మర్రి రాజు ములుగు ఎంపీటీసీ మవురాపూ తిరుపతి రెడ్డి ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు మట్టే వాడ తిరుపతి యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి జక్కుల రేవంత్ యాదవ్ కిసాన్ సెల్ జిల్లా కార్యదర్శి చక్రపు రాజు కిసాన్ సెల్ జిల్లా ప్రచార కార్యదర్శి నూనె టి శ్యాం సీనియర్ నాయకులు జక్కుల సాంబయ్య యసం రవి కుమార్ రవీందర్ రెడ్డి యూత్ నాయకులు మామిడి శెట్టి కోటి మేడం రమణ కర్ రాహుల్ చందు తదితరులు పాల్గొన్నారు

## శీ బ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం నూతనంగా నిర్మించిన దేవాలయంలో ప్రతిష్ఠాపన మహెూత్సవం

**అందోల్, మార్చి 18 (అక్షర వెలుగు):** అందోల్ నియోజకవర్గం టేక్మాల్ మండలం తంప్లూర్ గ్రామంలో నూతనంగా నిర్మిం చబడిన శ్రీ శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం ప్రతిష్ఠ కార్యక్రమం ఈరోజు తంప్లూర్.గ్రామంలోని స్వామి వారి విగ్రహాలు ఊరేగింపు భజన కార్యక్రమం మరియు కోలా కోలాటాలతో, భక్తి భజన పాటల తో ఊరేగింపు చేయడం జరిగింది శ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి దేవాలయం, గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున యువకులు ఆడపడుచులు యూత్ నాయకులు ఈ కార్యక్రమానికి విచ్చేసిన. బ్రహ్మ శ్రీ తాళాల నవనాథ శర్మ బ్రహ్మశ్రీ భాగవతం హరి ప్రసాద్ శర్మ ఈ కార్యక్రమంలో పాల్గొన్నవారు గ్రామ సర్పంచ్ ఆకుల సంగయ్య, జడ్పిటిసి సర్వాణి సరోజ మల్లేశం, ఎంపీటీసీ బుడల భూమయ్య, కేశఅప్ప, రాజప్ప, దత్తు, నాగయ్య భజన మండలి గ్రూప్ వార్డు మెంబర్లు గ్రామ ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది

# ఎర్రి గట్టమ్మ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం



**ములుగు, మార్చి 18 (అక్షర వెలుగు):** వెంకటాపూర్ మండలం ఇంచర్ల శివారు 163 జాతీయ రహదారి ఎర్రి గట్టమ్మ వద్ద ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది మూడు కార్లు ఒక బైక్ ఢీకొన్న ప్రమాదంలో ఒకరు అక్కడికక్కడే మృతి చెందగా మరో ఐదుగురికి తీవ్ర గాయాలు కాగా వారిని 108 సహాయంతో ములుగు ఏరియా ఆసుపత్రికి తరలించడం జరిగింది ఈ ప్రమాదంపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉన్నాయి.



ఘటనపై వివరాలు అడిగి తెలుసుకుంటున్న సీతక్క

# యువరైతు ఆత్మహత్య



**గణపురం, మర్చి 18 (అక్షర వెలుగు):** మండలంలోని గాంధీనగర్ గ్రామానికి చెందిన బీణబోయిన సురేష్ (39) తనకున్న ఒకటిన్నర ఎకరాల్లో మిర్చి పంట సాగు చేశాడు. పెట్టుబడి కోసం అప్పు చేశాడు. మిర్చి పంటకు తామర పురుగు ఆశించడంతో పంట పూర్తిగా దెబ్బతింది. దీంతో అప్పులు ఎలా తీర్చాలనే మనస్తాపంతో సురేష్ శుక్రవారం తెల్లవారుజామున ఎవరూ లేని సమయంలో ఇంటి వెనకాల జామ చెట్టుకు ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతుడి తండ్రి భిక్షపతి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ ఉదయ్ కిరణ్ కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# పీడీఎస్ బియ్యం పట్టివేత



**గణపురం, మార్చి 18 (అక్షర వెలుగు):** మండలంలోని బుద్ధారం గ్రామంలో పోలీసులు పెట్రోలింగ్ చేస్తుండగా కేశవాపూర్ గ్రామానికి చెందిన జడల కుమారస్వామి పిడిఎస్ రైస్ మహారాష్ట్రకు తరలిస్తుండగా పట్టుకున్నారు. 30 క్వింటాళ్ల బియ్యం సుమారు రూ. 24000 ఉంటుందని ఎస్ఐ ఉదయ్ కిరణ్ తెలిపారు. ఎఫ్ఐఆర్ నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

# కరీంనగర్‌లో హెూలీ సంబరాలు



**కరీంనగర్, మార్చి 18 (అక్షర వెలుగు):** గత రెండు సంవత్సరాలుగా కరోనా తీవ్రత వల్ల హెూలీ పండుగ జరుపుకోలేదు. ఈసారి కరోనా తీవ్రత తగ్గినందున ప్రజలు రాజకీయ పార్టీ నేతలు హెూలీ ఘన ంగా జరుపుకున్నారు.

# దేశంలోనే మొదటి సారి విడాకుల నమోదు చట్టం

(మొదటి పేజీ తరువాయి..) న్యాయం చేసి అండగా నిలిచే ప్రభుత్వం అని చెప్పిన ఆయన.. మహిళల సంక్షేమంతో పాటు పిల్లులు లింగ మార్పిడికి చేయించుకున్న వారితో సహా వికలాంగులకు ఈ చట్టం అండగా ఉంటుందని ఆయన అన్నారు. ఇప్పటికే వీరి సంక్షేమానికి సంబంధించి కేరళ శాసనసభ కమిటీ పలు కీలక సిఫార్సులు చేసినట్లు చెప్పారు. ఈ కారణం గానే విడాకుల నమోదు చట్టాన్ని తీసుకుని వచ్చే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు. ఈ చట్టానికి సంబంధించిన కొన్ని కీలక చట్టాలు నిపుణుల కమిటీ పరిశీలిస్తుందని అన్నారు. ఈ చట్ట సవరణలు పూర్తి స్థాయిలో సిద్ధం అయిన తర్వాత కేరళ అసెంబ్లీలో ప్రవేశ పెట్టనున్నట్లు పేర్కొన్నారు. కేరళ చేపట్టబోతున్న ఈ విడాకులు నమోదు చట్టంతో విప్లవాత్మక మార్పులకు రాష్ట్ర ప్రభుత్వం తెరతీయ బోతుందని అన్నారు. దీనిపై దేశవ్యాప్తంగా 2008లో చర్చ జరిగినట్లు మంత్రి చెప్పారు. భారతీయ లా కమిషన్ కూడా విడాకుల నమోదు ను తప్పనిసరిగా చేయవలసిన అవసరాన్ని నొక్కి చెప్పినట్లు పేర్కొన్నారు. మతం ఏదైనా సరే ఈ చట్టం వర్తించేలా చేయాలని అప్పటి నివేదిక చెప్పినట్లు వివరించారు. దీనిలో భాగంగానే కేరళ వివాహ నమోదు చట్టానికి మార్పులు చేర్పులు చేయనున్నారు. లా కమిషన్ సూచించిన విధంగా చట్టాన్ని తీసుకు వస్తామని చెప్పారు.

# హెూలీ సంబురాలలో పాల్గొన్న


### మంత్రి కొప్పుల ఈశ్వర్



**కరీంనగర్, మార్చి18(అక్షర వెలుగు):** మంత్రి కొప్పుల ఈశ్వర్ హెూలీ వేడుకల్లో పాల్గొన్నారు. కరీంనగర్ శ్రీపురం కాలనీలోని తన నివాసం వద్ద మంత్రి కొప్పుల ఈశ్వర్ చిన్నారులతో కలిసి హెూలీ సంబు రాలలో పాల్గొన్నారు. మంత్రికి చిన్నారులు తిలకం దిద్ది హెూలీ సందర్భంగా హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు. మంత్రి చిన్నారులను ఆప్యాయంగా పలకరించి,వారి చదువుల గురించి అడిగి తెలుసుకున్నారు,మంచిగా చదివి జీవితంలో ఉన్నతంగా ఎదగాలని ఆకాంక్షించారు, ఆశీస్సు లు అందించారు.

# పొంచివున్న 'స్టెల్త్ ఒమిక్రాన్' ముప్పు !

### వైద్య నిపుణుల హెచ్చరిక



**న్యూఢిల్లీ , మార్చి 18 (అక్షర వెలుగు):** కరోనా 4వ దశ ముప్పు రానుందని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ విజయవాడ శాఖ దేశ ప్రజలనుద్దేశించి ఒక పత్రికా ప్రకటన విడుదల చేసింది. ఒమిక్రాన్ కంటే స్టెల్త్ ఒమిక్రాన్ జోరుగా వ్యాపిస్తుందని, ప్రపంచవ్యాప్తంగా తన ఉనికిని చాటుతోందని పేర్కొంది. ఇపుడు కరోనా కేసులు తగ్గాయని కరోనా వైరస్‌ను తక్కువ అంచనా వేయొద్దని, అజాగ్రత్తగా ఉండొద్దని ప్రజానీకాన్ని కోరింది. మాస్కులు ధరిస్తూనే ఉండాలని, శానిటైజర్లు వాడాలని సూచించింది. ఇదిలా ఉండగా, చైనాలో ప్రస్తుతం కరోనా వ్యాప్తి చెందడం ఆందోళన కలిగిస్తోందని, 'స్టెల్త్ ఒమిక్రాన్' రూపంలో ఈ మహమ్మారి ఇపుడు కొత్తగా వ్యాప్తి చెందుతోందని పేర్కొంది.

# సినిమా

## స్పెయిన్‌లో ధమాకా షూటింగ్



మాస్ మహారాజా రవితేజ హీరోగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందుతోన్న కామెడీ ఎంటర్ టైనర్ 'ధమాకా'. డబుల్ ఇంపాక్ట్ ట్యాగ్ లైన్ తో ఆసక్తికరమైన కథాకథనాలతో ఈ సినిమా రూపొందుతోంది. రవితేజ ద్విపాత్రాభినయం చేయనుండడం ఈ సినిమా ప్రత్యేకత. శ్రీలీల కథానాయికగా నటిస్తుండగా.. 'బెంగాల్ టైగర్' ఫేమ్ భీమ్స్ దీనికి సంగీతం అందిస్తున్నాడు. ఇప్పటికే నాలుగు షెడ్యూల్స్ కంప్లీట్ చేసుకొన్న ఈ సినిమా నుంచి సరికొత్త షెడ్యూల్ .. స్పెయిన్‌లోప్రారంభం అయింది. ఈ విషయాన్ని ట్విట్టర్ వేదిక గా ప్రకటిస్తూ .. ఒక ఫోటోను షేర్ చేశారు. అందులో రవితేజ, శ్రీలీలతో పాటు దర్శకుడు త్రినాథరావు, శేఖర్ మాస్టర్, చిత్ర బృందంలోని ఇతర సభ్యులు రివీలయ్యారు. స్పెయిన్ లో జరిగే షెడ్యూల్ లో భారీ ఎత్తున పలు సాంగ్స్ చిత్రీకరించబోతున్నారు. అందులో ఒక పాట స్పెయిన్ లో చారిత్రక ప్రదేశం అయిన ఎ÷–లాజా డీ ఎస్పన దగ్గర షూట్ చేయబోతున్నారు. శేఖర్ మాస్టర్ కొరియో గ్రఫీలో ఈ పాటను చిత్రీకరిస్తారు. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ, అభిషేక్ ఫిల్మ్స్ సంయుక్త బ్యానర్స్ పై టీజీ విశ్వప్రసాద్ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. వివేక కూచిభొట్ల ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ గా వ్యవహరిస్తున్నారు.



## రికార్డుస్థాయి కలెక్షన్లు సాధించిన కాశ్మీర్ ఫైల్స్

### ఓటీటీలో విడుదలకు మరింత ఆలస్యం




ది కశ్మీర్ ఫైల్స్'.. సినిమా గురించే ఇప్పుడు దేశమంతా చర్చిస్తున్నారు. కాశ్మీర్‌లో పండింట్ల ఊచకోత తదితర విషయాలను చక్కగా తెరకెక్కించారు. 'ది కశ్మీర్గ్ ÷ల్స్' చిత్రం విషయానికొస్తే.. 1980-90లలో కశ్మీర్‌లో ఓ వర్గంపై మరో వర్గం చేసిన మారణకాండ ఆధారంగా ఈ చిత్రాన్ని తెరకెక్కించారు దర్శకుడు వివేక్ అగ్నిహోత్రి. అనుపమ్ ఖేర్, పల్లవి జోషి, దర్శన్ కుమార్ మరియు మిథున్ చక్రవర్తి కీలక పాత్రలు పోషించారు.చిన్న సినిమాగా వచ్చిన ఈ మూవీ.. పెను సంచలనంగా మారింది. భారత ప్రధాని నరేంద్ర మోదీతో పాటు పలువురు సినీ, రాజకీయ ప్రముఖులు ఈ సినిమాపై ప్రశంసల జల్లు కురిపించారు. అంతేకాదు ఉత్తరప్రదేశ్, కర్ణాటక, గుజరాత్‌తో పాటు పలు బీజేపీ పాలిత రాష్ట్రాలు అడగకుండానే వినోదపు పన్నును మినహాయించాయి. అస్సాం ప్రభుత్వం అయితే ఈ సినిమా కోసం ఏకంగా తమ ఉద్యోగులకు హాఫ్‌డే సెలవునే ప్రకటించింది. ఇక బాక్సాఫీస్ వద్ద ఈ సినిమా దూసుకెళ్తోంది. రూ. 18 కోట్ల బ్జడెట్‌తో తెరకెక్కిన ఈ చిత్రం ఇప్పటికే రూ. 50 కోట్లను కొల్లగొట్టి రికార్డు సృష్టించింది. ఈ వారాంతంలో ఈ మూవీ కచ్చితంగా రూ.100 కోట్లు వసూళ్లను రాబడుతుందని సినీ విశ్లేషకులు చెబుతున్నారు. ఈ మూవీ ఎప్పుడెప్పుడు ఓటీటీల విడుదలవుతుందా అని సినీ అభిమానులు ఎదురు చూస్తున్నారు. ఈ మూవీ ఓటీటీ హక్కులను జీ5 సొంతం చేసుకుంది. వాస్తవానికి ఈ మూవీ విడుదలైన (మార్చి 11) నాలుగు వారాల తర్వాత ఓటీటీలో రిలీజ్ చేయాలని భావించారు. ఈ మేరకు ఒప్పద్దం కూడా కుదుర్చుకున్నారు అయితే ఇప్పుడు ఈ చిత్రానికి వచ్చి క్రేజ్ దృష్ట్యా ఓటీటీ విడుదల తేదిని వాయిదా వేసుకున్నట్లు తెలుస్తోంది. ఏప్రిల్ రెండో వారంలో కాకుండా.. మేలో ఈ చిత్రాన్ని ఓటీటీ విడుదల చేయాలని భావిస్తున్నారని సమాచారం. తాజా సమాచారం ప్రకారం మే 6 నుంచి జీ5లో ఈ చిత్రం స్ట్రీమింగ్ కానుందని అంటున్నారు.

## ప్రభాస్ సరసన కృతిశెట్టికి ఛాన్స్ ?



పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ 'రాధేశ్యామ్' చిత్రం రీసెంట్ గా థియేటర్స్ లోకి వచ్చి..మిక్స్ టాక్ వచ్చినప్పటికీ.. మంచి ఓపెనింగ్స్ ను రాబట్టింది చిత్రం. ఇక ప్రభాస్ తదుపరి చిత్రాల్లో ఒకటైన 'ఆదిపురుష్' టాకీ పార్ట్ పూర్తి చేసుకోగా.. 'సలార్, ప్రాజెక్ట్ కె' చిత్రాలు షూటింగ్ దశలో ఉన్నాయి. త్వరలోనే సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో 'స్పిరిట్' చిత్రం సెట్స్ పైకి వెళ్ళబోతోంది. ఇవి కాకుండా ప్రభాస్ మారుతి దర్శకత్వంలో ఒక సినిమా చేయబోతున్నట్టు వార్తలొస్తున్నాయి. ఔట్ అండ్ ఔట్ కామెడీ మూవీగా రూపొందనున్న ఈ సినిమాకు సంబంధించిన ఒక వార్త సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతోంది. తాజా సమాచారం ప్రకారం ప్రభాస్ – మారుతి కాంబో మూవీలో కథానాయికగా 'ఉప్పెన' బ్యూటీ కృతి శెట్టిని ఎంపిక చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాలో ముగ్గురు హీరోయిన్స్ నటించనుండగా.. ఒక హీరోయిన్ గా కృతి ఎంపికైందట. మరో హీరోయిన్.. మాళవికా మోహనన్ కాగా.. ఇంకో హీరోయిన్ ను అన్వేషిస్తున్నారని టాక్. 'రాజా డీలక్స్' అనే టైటిల్ ను ఈ సినిమా కోసం రిజిస్టర్ చేశారని వార్తలు రాగా.. ఆ టైటిల్ ను మార్చబోతున్నారని తెలుస్తోంది. ఉప్పెన , శ్యామ్ సింగరాయ్, బంగార్రాజు చిత్రాలతో హ్యాట్రిక్ హిట్స్ అందుకున్న కృతి శెట్టి .. ప్రస్తుతం ది వారియర్, మాచర్ల నియోజకవర్గం చిత్రాల్లోనూ హీరోయిన్‌గా నటిస్తోంది. ఇప్పుడు ప్రభాస్ జోడీగా కూడా ఎంపికవనుండడం ఎంతవరకు నిజమో తెలియాల్సి ఉంది.

## ట్రిపుల్ ఆర్ కోసం భారీగా ప్రమోషన్స్



ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకులు, అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న 'ఆర్‌ఆర్‌ఆర్' సినిమా మరికొన్ని రోజుల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. దర్శకధీరుడు రాజమౌళి ప్రతిష్టాత్మకంగా తెరకెక్కిన ఈ చిత్రంలో కొమురం భీంగా జూనియర్ ఎన్టీఆర్, అల్లూరి సీతరామారాజుగా రామ్ చరణ్ నటించారు. తారక్ సరసన ఒలివియా మోరీస్, చెర్రీకి జోడిగా అలియా భట్ కనువిందు చేయనున్నారు. ఈ చిత్రానికి కీరవాణి సంగీతం అందించారు. మార్చి 25న ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సినిమా ప్రమోషన్లను భారీగానే ప్లాన్ చేసింది జక్కన్న టీం. స్పెషల్ ఇంటర్వ్యూలు, ప్రత్యేక ఈవెంట్లతో భారీగా సన్నాహాలు చేస్తున్నారు. ఈ క్రమంలో మార్చి 19న బెంగళూరులోని చిక్కబల్లాపూర్‌లో 'ఆర్‌ఆర్‌ఆర్' ప్రిరిలీజ్ ఈవెంట్ గ్రాండ్‌గా జరగనుంది. ఈ ఈవెంట్‌లో మూవీ ప్రమోషన్స్ కోసం ఏకంగా కర్ణాటక ముఖ్యమంత్రి బసవరాజు బొమ్మై ముఖ్య అతిథిగా విచ్చేయనున్నట్లు ఓ వార్త చక్కర్లు కొడుతోంది. కర్ణాటక సీఎంతోపాటు ఆరోగ్య శాఖ మంత్రి, సూపర్ స్టార్ శివరాజ్ కుమార్‌లు కూడా ముఖ్య అతిథులుగా రానున్నట్లు టాక్ వినిపిస్తోంది. అంతేకాకుండా ఈ వేడుకను దివంగత నటుడు పునీత్ రాజ్ కుమార్‌కు అంకితం ఇవ్వనున్నట్లు సమాచారం. అయితే ఈ విషయాలపై అధికారిక ప్రకటన మాత్రం ఇంకా వెలువడలేదు.

Edited, Printed, Published & owned by **GOSUKONDA PRUDHVIRAJU**, Published From, H.No. 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, TELANGANA,
Printed at **GPR PUBLICATIONS**. H.NO: 6-17, VI:PALIVELA, MANDAL:MUNUGODE, DIST: NALGONDA - 508244, Editor: **GOSUKONDA PRUDHVIRAJU**,
TITLE CODE.TELTEL02057, Cell:8464816456 Email: aksharavelugudaily@gmail.com, Website: www.aksharavelugu.com